


# అసలేం జరిగిందంటే...

నెల్లూరి కేశవస్వామి

ఆ దృశ్యం–!.... అది నా కంట పడగానే చకితుణ్ణయిపోయాను.

ఆ రోజు నాకు కాస్త పెందరాళే మెలుకువొచ్చింది. అలవాటు ప్రకారం వెంటనే 'మార్నింగ్‌వాక్' కని బయలుదేరాను. మామూలు కంటే మరి కాస్త దూరం నడిచి, ఇంటికి మళ్ళాను. దారిలో ఆ దృశ్యం!.... అంటే వెళ్ళేప్పుడు నాకు తెలియకండానే, నేను చూడకండానే ఆ శవాన్ని దాటి.... ఛీ ఛీ! 'శవం' అన్న పదాన్ని వాడటానికి నా మనసు వొప్పుకోవటం లేదు. రోడ్డు ప్రక్కన ఫుట్‌పాత్ పైన నిద్రపోతూ వున్నట్టు పడున్న ఆ అందమైన వ్యక్తిని శవం అని ఎలా అనను? కాని చుట్టూ చేరిన నలుగురూ అదేమాట అంటున్నారు. మరి నమ్మకండా ఎలా వుండగలను....?

అయినా, ప్రమాద సూచనలేవీ లేవే? గాయాలూ, నెత్తురూ ఏమీ కనిపించటం లేదు. మరి, ఎలా చచ్చివుంటాడు?.... గుండె ఆగిపోయి వుంటుంది. అవును, అదే అయివుంటుంది. అన్ని జబ్బుల కంటే గుండెజబ్బు విపరీతంగా పెరిగిపోతోన్న ఈ రోజుల్లో ఆశ్చర్యమేముంది?.... పాపం! అట్టే వయసు కూడా లేదు.... భార్యాపిల్లలు వుండే వుంటారు. ఇక వాళ్ళ గతేం కాను?.... చుట్టూ చేరి భోరుభోరున ఏడుస్తూన్నట్టు ఊహ కలగగానే 'అబ్బ' భరించలేకపోయాను. అక్కడో క్షణంకూడా నిలవలేకపోయాను. వెంటనే గబగబా ఇంటి వేపుకు నడిచాను.

దారిలో కాఫీహోటల్ కనిపించింది. వెళ్ళి కూచుని కాఫీకి ఆర్డరిచ్చాను. నేను తప్ప మరెవ్వరూ లేరు అప్పటికి.

ఇంతలోకి ఇద్దరు, దంపతులు గామాల్ను, వచ్చారు, జోరుజోరుగా వాదించుకుంటూ. నా ప్రక్క బల్లమీదే కూచున్నారు.

"అది హత్యే, ముమ్మాటికీ హత్యే. నేను ఘంటాపథంగా చెప్పగల్ను" అంటున్నాడు అతను.

"అబ్బబ్బ! ఏవిటండీ ఈ గోల? మీ మాటే మీకా? ఇతర్లు చెప్పేది వినిపించుకోరే?"

"మరి అది హత్యే అంటే నమ్మవే?"

"ఆఁ హత్యట హత్య! నడి బజారులో హత్యేవిటండీ ?"

"వండర్‌ఫుల్! 'నడిబజారులో హత్య'. బ్యూటీఫుల్! అద్భుతంగా వుంది టైటిల్ ! ఎవరైనా ఈ కేసుమీద

నవలే రాయదలుచుకుంటే టైటిల్ పెట్టుకోమని నా సలహా."

"అదిగో, అస్తమానమూ ఆ వెధవ డిటెక్టివ్ పుస్తకాలు చదువుతూంటంవల్లే మీ మతి ఇలా చలించిపోతోంది."

"అన్నన్నా! ఎంతమాటన్నావు? డిటెక్టివ్ నవలలు వెధవ పుస్తకాలా?.... వేటర్! రెండు కాఫీ..... ఆఁ, అవి ఎంత గొప్ప గ్రంథాలో నీకేం తెలుసు? విజ్ఞాన దీపకలంటే నమ్ము. దృష్టి ఇట్టే విశాలమైపోతుంది."

"అవును విశాలమైపోయి ప్రపంచమంతటా హత్యలూ, హంతకులే కనిపిస్తుంటారు."

"అది నా తప్పా? అడుగడుగునా అమానుష దారుణ హత్యలు అడ్డుతగలడం నా తప్పా?.... ఇవాళ్టి హత్యే చూడరాదూ?"

"మళ్ళీ అదే మాట. ఆ మనిషి ఎవరో పాపం, చెక్కు చెదరకండా పడి వుంటే, మాటిమాటికీ హత్య అంటకడతారేం?"


అతను పెద్దగా నవ్వాడు. "పిచ్చిదానా! హత్య అంటే పిస్తోలుతో కాల్చటమో, కత్తితో పొడవటమో, గొంతు నులిమివేయటమో అనుకుంటున్నావు. అవన్నీ పాతపద్ధతులు. రానురాను హత్య కూడా అతి సున్నితమైన కళగా మారిపోయిందని నీకింకా తెలీదు గామాల్ను. ఈ రోజుల్లో ఒక చిన్న షాట్.... అంటే, ఇంజక్షన్ చాలు. మనిషన్నవాడు చెక్కు చెదరకండా చచ్చి వూరుకుంటాడు."

"అయితే, ఆ ఇంజక్షనిచ్చిన డాక్టరెవరో?"

"అంటే హంతకు డెవరో చెప్పమంటున్నావు.... నాకేం తెలుసు?.... నువ్వే కావచ్చు."

"నేనా??" ఆశ్చర్యపోయింది ఆవిడ.

"లేదా, నేనే కావచ్చు."




'ఇదేఁవిటి, పిచ్చిలేసిందా ఈనకూ? అన్నట్టు చూసింది భర్తకేసి. "ఇది మరీ బావుందండోయ్" అన్నది.

"ఇదిగో చూడూ, ఇది వేళాకోళం కాదు. హత్య విషయాలు అతి జాగ్రత్తగా వుండాలి, తెలుసా? హంతకుడు ఎవరో తేలి, పట్టుబడేదాకా, ఎవరినీ అనుమానించకుండా వుండటానికి వీల్లేదు."

"అందుకని కనిపించిన వాడినల్లా అనుమానించటమేనటండీ?"

"ఏమో, ఏ పుట్టలో ఏ పాముండో ఎవరికి తెలుసు?"

"మరి ఆ హంతకుడు పట్టుపడటం ఎలాగా?"

"క్లూలు కావాలి. క్లూలు. క్లూలు దొరికితే చాలు, ఇట్టే పట్టుబడి పోతాడు."

"క్లూలా?.... అవెక్కడదొరుకుతాయి"

"అక్కడే, ఆ శవం దగ్గర. ఒక్క అయిదు నిముషాలు పరిశోధించి వుంటే చాలు బోలెడన్ని క్లూలు దొరికేవి, కానీ ఏదీ, నువ్వు నిలువనిస్తేగా?.... లాక్కొచ్చేశావు."

"సరేనండి అపరాధ పరిశోధక మహాశయా! ఇప్పుడెళ్ళి ఆ క్లూలేఁవిటో వెతుక్కోండి. నే నింటికెళ్తాను."

"అమ్మయ్యో! ఇంతవరకు అక్కడింకా క్లూలు కూచున్నాయేఁవిటి? మాయం చేసెయ్యరూ? అంత వెర్రివాళ్ళా వాళ్ళు?"

"వాళ్ళెవరూ?"


"అదే, ఆ దొంగముఠావాళ్ళు."

"అదేఁవిటి, హంతకుల్లోంచి దొంగల ముఠాలోకి దిగారేఁవిటి?"

"దొంగలంటే దోపిడీచేసే దొంగలేం కాదు, దొంగనోట్లు తయారుచేసే దొంగముఠా అది.... ఇంతకు అసలేం జరిగిందో చెప్పమన్నావా?"

"అయ్యో, మీరు చెప్పకండా వుంటారా. చెప్పేసెయ్యండి అదేదో."

కాస్త తగ్గుస్వరంలో మొదలెట్టాడు అతను. "ప్రస్తుతం ఈ పట్నంలో దొంగనోట్లు తయారు చేసేఒకముఠా పని చేస్తోంది. రాత్రుళ్ళు దొంగనోట్లుతయారు చెయ్యటం, దినమల్లా వాటిని దేశమంతటా పంపిణీచెయ్యటం వాళ్ళ పని.




ఆ చచ్చిపోయిన అభాగ్యుడు కూడా ఆ ముఠాకు చెందినవాడే. ఈ మధ్య ముఠా నాయకునితో ఏవో మనస్పర్ధలొచ్చాయి. విడిపోతాననీ, పోలీసులకి ఆచూకీ ఇస్తాననీ బెదిరించాడు. ఇంకేముందీ, ముఠా నాయకుడు సిగ్నల్ ఇచ్చాడు. అతని అనుచరులు పదినిముషాల్లో పని పూర్తి చేశారు. తెల్లవారకుండానే శవాన్ని తెచ్చి ఫుట్‌పాత్ పైన పడేసి చక్కా వెళ్ళారు."

"ఎందుకండీ, ఈ లేనిపోనివన్నీ కల్పిస్తారు? నేను చెబుతాగా, అది హత్య ఎంతమాత్రం కాదు, ఆత్మహత్య."

"ఆత్మహత్య....అదెవ్వరుచెప్పారు?"

"ఒకరు చెప్పేదేఁవిటి,నా అంతరాత్మే చెబుతోంది. హృదయమున్నవాళ్ళ అతని ముఖంకేసి ఒక్క క్షణం చూస్తే చాలు అంతా కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది."

"ఏఁవిటో అది?"

"....వినండి. అత నొక కవి, గాయకుడు, చిత్రాకారుడు...."

"అగు అగు. కవీ, గాయకుడూ, చిత్రకారుడూ....ఒక్కడే అన్నీనా ?"


"అదిగో, మీరు అనవసరంగా అడ్డు తగులుతున్నారు. ఇందాక మీ ఇష్టమొచ్చినట్టు మీరు చెప్పుకుపోయారు. ఇప్పుడు నన్ను చెప్పనివ్వాలి"

"సరే, సరే, కానియ్....ఈలెక్కరెలాగుంటుందో...."

"అతనొక కవి, గాయకుడు, చిత్రకారుడు, అవునా! అతను రాసిన గేయాలు చదివి తన్మయం పొందేవారూ, అతని గానంవిని ఆనందసాగరంలోమునిగి తేలిపోయేవారు, అతను గీసిన చిత్రాలను చూసి మంత్రముగ్ధులై పోయేవారూ అనేకులు.వారిలోఆ అమ్మాయి కూడా ఒకర్తె. ఆమె అందాల రాశి. చూపులు కలియగానే హృదయాలు పెనవేసుకుపోయాయి. ఎన్నెన్నో కలలు కన్నారు, ఎన్నెన్నో వాగ్దానాలు చేసుకున్నారు. కాని, అతను నిరుపేద, ఆమె ఒక ధనవంతుని గారాల కూతురు. అతణ్ణి తప్ప మరొకణ్ణి పెళ్ళి చేసుకోనని మొండిపట్టు పట్టింది. తన ఏకైక పుత్రిక కోరికను కాదనలేక వొప్పుకున్నాడు తండ్రి. కాని, ఆ వొప్పుకోవటం మనస్ఫూర్తిగా కాదు. అదొక ఎత్తు. కూతురి చదువు వంకబెట్టి పెళ్ళి రెండేళ్ళు వాయిదా వేశాడు. ఈ లోపున అతని చిత్రలేఖనానికి మెరుగులుదిద్దే మిషమీద శాంతినికేతన్‌లో చేర్పించాడు. కొన్నాళ్ళకు, అతను ప్రమాదవశాత్తు హుగ్లీ నదిలో పడి కొట్టుకుపోయినట్టు ఒక టెలిగ్రాం కల్పించి తెప్పించాడు. అతని ఉత్తరాలు కూతురికి అందకండా కట్టుదిట్టం చేశాడు. మరి కొన్నాళ్ళకు, కూతురి గుండె గాయం మానిందన్న ధైర్యం రాగానే మళ్ళీ పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. ఎలాగో అలాగ వొప్పించాడు. పెళ్ళి నిశ్చయమైంది.... అటు అతను, తన ఉత్తరాలకు జవాబులు రాక తల్లడిల్లిపోయి స్వయంగా బయలుదేరాడు. రైలు దిగేసరికి చీకటిపడ్డది. తిన్నగా ఆ ధనవంతుని ఇంటికి దారితీశాడు. దోవలో ఒక ఊరేగింపు ఎదురైంది. రకరకాల బాజాబజంత్రీలతోనూ, లైట్లతోనూ, బాణాసంచాతోనూ వెళ్తోన్న పెళ్ళి ఊరేగింపు అది. అప్రయత్నంగా అతని దృష్టి ఆ నవదంపతుల కారువైపుకు పోయింది. గుండె ఆగినట్టనిపించింది. పెళ్ళికూతురు మరెవ్వరో కాదు, తన హృదయరాణి. ఒఖ్ఖసారి ఎలుగెత్తి అరవబోయాడు. కాని, శోషవచ్చి పడిపోయాడు. తిరిగి తెలివి వచ్చేసరికి అంతటా అంధకారం. ఆ కారుచీకట్లో అతని చేతికున్న వజ్రపుటుంగరం తళుక్కున మెరిసింది. ఆమె తన ప్రేమ చిహ్నంగా అర్పించిన కానుక అది. వెంటనే ఆ వుంగరాన్ని నోట్లో వేసుకుని నమిలి మింగేశాడు. అక్కడే వొరిగిపోయాడు...."

"కట్.... ఆ ఆఖరు సీను నాకు నచ్చలేదు సుమా. ఈనాటి యువతరం చెయ్యాల్సిన పనికాదది. అంతకంటే ఒక పిస్తోలు సంపాదించి, ఆ ధనవంతుణ్ణి కాల్చి చంపి, కోర్టులో ఆ ధనవంతులు చేసే అన్యాయాలమీద ఒక ఉపన్యాసం దంచి, ఉరికంబం ఎక్కివుంటే ఎలా వుండేది?"

"క్షమించాలి. అక్కడ ఫుట్‌పాత్ పైన చచ్చిపడివున్న వ్యక్తిని గురించే కదూ మీరు మాట్లాడుకుంటోంది?" అంటూ ఒకతను దంపతుల దగ్గరికి



వచ్చాడు. అతను హోటల్లో కెప్పుడొచ్చాడో గమనించనేలేదు. అసలు అతను ఎవరో కూడా తెలీదు. మొహం మాత్రం ఎక్కడో చూసినట్టే వుంది.

"అలా ఆశ్చర్యపోకండి....మరేమీ లేదు. మీరా వ్యక్తి గురించి అనుకుంటున్నదేదీ నిజంకాదనీ, అసలేం జరిగిందో చెబుదామని...."

"మీరూ....?"

"నే నెవరైతే ఏంలెండి.... అతని గురించి మీ కంటే నాకు కాస్త ఎక్కువ తెలుసు కాబట్టి, అసలేం జరిగిందో చెబుతాను.... ఈ కుర్చీలో కూచోనా?"

"ఓ, దానికేం, కూచోండి" అంటూ ఆహ్వానించాడు భర్త. భార్య ఇంకా అనుమానంగానే చూస్తోంది.

"థాంక్స్!" అంటూ అతను కూచున్నాడు. నింపాదిగా చెప్పటం మొదలెట్టాడు. మీరనుకుంటున్నట్టు అది హత్య కాదు. ఆత్మహత్యా కాదు. అతని మరణానికి కారణం దొంగనోట్లూ కావు, ప్రేమా కాదు.... అతని అందం."

"అందమా??" దంపతులిద్దరూ ఆశ్చర్యంతో నోళ్ళెళ్ళబెట్టారు. నాకూ అంతు బట్టలేదు. మరీ శ్రద్ధగా విన్నాను.

"అవును, అందమే.... మగసిరి ఉట్టిపడే అందం. మామూలు మనుషులకంటే అతను కాస్త ఎక్కువే అందంగా వుంటాడని మీరూ వొప్పుకుంటారనుకుంటాను.... ఆ అందమే ముప్పు తెచ్చింది."

"ఎలా?"

"చెబుతాను.... మేడం! మీకు అభ్యంతరం లేకపోతే, సిగరెట్ కాల్చుకోనాండీ?"

"ఓ, దానికేం, కాల్చండి!" అన్నాడు భర్త. భార్యకూడా తలూపింది.

అతను జేబులోంచి ఒక ఖరీదైన పాకెట్ తీసి, ముందు భర్తకు అఫర్ చేశాడు. భర్త కాస్త చెయ్యి ముందుకు పోనిచ్చి, భార్యను చూసి వెనక్కి తీసుకున్నాడు. "అబ్బే! నాకు అలవాటు లేదండీ," అంటూ.

అతను సిగరెట్ వెలిగించి, రెండు దమ్ములు తీసి, తాను విడుస్తూన్న పొగ వేపుకే చూస్తూ, చెప్పుకుపోయాడు.

"అసలతను ఎవరో, ఎక్కడివాడో ఎవ్వరికీ తెలీదు. అతనికీ ప్రపంచంలో నా అన్నవాళ్ళు వున్నారో లేరో కూడా తెలీదు. ఎప్పుడూ పెద్దపెద్ద హోటళ్ళలోనే నివాసం చేస్తాడు. మంచి మంచి దుస్తులు వేస్తాడు. గొప్పగొప్ప క్లబ్బుల్లో తిరుగుతుంటాడు. రకరకాల కార్లలో షికార్లు కొడుతూంటాడు. వెంట ఒకరో, ఇద్దరో అందమైన ఆడవాళ్ళు కూడా అంటి వుంటారు.... మరి, అతను చేసే వృత్తి ఏవిటో, ఇదంతా ఎలా సాగుతోందో ఏమీ తెలీదు.... కాని అతను అందాన్ని అమ్ముకుని బ్రతుకుతాడని ప్రతీతి."

"ఏఁవిటీ....? అందాన్ని అమ్ముకోవటమా?" భార్యాభర్తల కళ్ళు మరీ పెద్దవైనాయి.

"అవును.... బహుశ, మీకు తెలిసి వుండదు. మగవాళ్ళల్లో కూడా కొందరికి తమ అందాన్ని అమ్ముకునే అవకాశాలు లేకపోలేదు ఈ ప్రపంచంలో.... ఈ మధ్యే ఒక డబ్బుగల వితంతువుకు అతని పైన మోజు కలిగింది. అతనూ కాదనలేడు. ఆమె ఘరానా మనిషి. అతణ్ణి బహిరంగంగా కలుసుకోలేదు, కాబట్టి కొన్ని రహస్యస్థలాలు ఏర్పరచుకున్నారు.... మామూలు ప్రకారం నిన్న రాత్రి ఇద్దరూ కలిసి కార్లో పట్నానికి పది మైళ్ళ దూరంలో వున్న ఒక రహస్య స్థలానికి వెళ్ళారు. తిరిగి బయలుదేరేసరికి మూడు దాటింది. అతని కప్పటికే నిద్ర ముంచుకొస్తోంది. ఇద్దరూ వెనక సీట్లో కూచుని వున్నారు. డ్రైవరు కారు నడుపుతూన్నాడు. హైరోడ్డుకు రావటానికి మూడుమైళ్ళ అడ్డదారి. అన్నీ ఎత్తుపల్లాలు. బాగా కుదింపులు పడుతూన్నారు. రోడ్డు చేరుకునేసరికి అతను బాగా వొరిగిపోయి వున్నాడు. నిద్రపోతున్నాడనుకొన్నది ఆవిడ. కాని పట్నంలోకొచ్చాక, స్ట్రీటులైట్ల వెలుగులో అతన్ని చూడగానే కెవ్వున కేకేసింది. కారు ఆపింది. తన అనుమానం డ్రైవర్‌కు చెప్పింది. డ్రైవర్ అతన్ని పరిశీలించి చూసి పెదవి విరిచాడు. ఆమె భయంతో గజగజ వణికిపోయింది. డ్రైవర్ ధైర్యం చెప్పాడు. కారు స్టార్టుచేసి, కాస్త చీకటిగా వున్నచోట ఆపి, శవాన్ని లాగి ఫుట్‌పాత్ పైన పడుకోబెట్టాడు. కారు శరవేగంతో వెళ్ళిపోయింది," అని ఆగిపోయాడు.

"మరి.... మరి అతను ఎలా చచ్చాడు?"

"అదే చెబుతున్నాను.... మీకు తెలుసో లేదో, మనిషి మెదడుకీ, వెన్నెముకకీ, మెడదగ్గర కొన్ని నరాల ద్వారా సంబంధం కలిగి వుంటుంది. దాన్నే మెడికల్ పరిభాషలో 'మెడిల్లా అబ్లాంగేటా' అంటారు. ఏ విధంగానైనా ఆ సంబంధం తెగిపోతే, మనిషి వెంటనే ప్రాణాల్ని కోల్పోతాడు. ఉరితీయటంలో అదే జరుగుతుంది.... అతనికీ అదే జరిగింది. అంటే అతని చావుకు కారణం అడ్డదారిలోని ఎత్తుపల్లాల కుదుపులన్నమాట.... ఇదీ సంగతి.... ఇక వస్తాను, శలవు" అంటూ లేచాడు. "ఏయ్ రిక్షా!" అంటూ వీధిలోని రిక్షాను కేకవేసుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ దంపతు లిద్దరూ నోట మాటరాక, ఒహరి మొహాలు ఒహరు చూసుకుంటూ కూచుండిపోయారు. నేనూ కొన్ని క్షణాల తర్వాత గాని తేరుకోలేదు. వెంటనే ఆ అపరిచిత వ్యక్తిని వెతుక్కుంటూ వీధిలోకి వెళ్ళాను. అప్పటికే అతను రిక్షా మాట్లాడుకుని ఎక్కబోతున్నాడు.

"ఏమండోయ్, మిమ్మల్నే.... కాస్త ఆగండి" అన్నాను.

"నన్నా?.... ఏఁ?" అంటూ వెనుదిరిగాడు.

"ఒక్క మాట.... నేనూ ఆ ఫుట్‌పాత్ పైని శవాన్ని చూసినవాణ్ణే. అతని గురించి మీ రిందాక చెప్పింది నమ్మమంటారా?"

అతను పెద్దగా నవ్వాడు. "మీ ఇష్టం. ఆ దంపతులు చెప్పింది కూడా వినే వుంటారుగా? వాళ్ళని నమ్మగలిగితే, నే చెప్పిందీ నమ్మొచ్చు."

"....అంతే నంటారా?"

"మరింకెంత? అతను డిటెక్టివ్ నవలలు చదివీ, ఆమె సినిమాలు చూసీ తమ తమ వూహాకల్పనలు చేశారు. వాటికి నేనూ ఒక పోగువేశాను."

"అయినా, అదేదీ నిజంకాదని మీ రెలా అనగలరు?"

"ఎలాగా?.... మీరు నన్ను ఇంకా పోల్చుకోలేదా?.... మీరు చూసిన శవాన్ని నేనే."

"ఆఁ?.... మీరా?" నోరెళ్ళబెట్టటం నావంతయింది.

"ఊఁ, పోనీవోయ్ రిక్షా" అంటూ ఎక్కికూచున్నాడు.

"అరెరే, ఆగండి, ఆగండి కొంచం.. ఇంతకూ అసలేం జరిగిందో చెప్పరూ?"

"ఏముందీ, వడ్లగింజలోనిదే బియ్యపుగింజ.... నేను కథలు రాస్తాను. రాత్రి ఒక ప్లాటుకోసం ఎంతసేపు ఆలోచించినా సరైంది దొరకలేదు. తెల్లవారుఝామున్నే లేచి బయలుదేరి, ఆలోచిస్తూ రోడ్డెంబటి తిరగటం మొదలెట్టాను. ఒకచోట నా కాలు అరటి తొక్కపైన పడింది. చర్రున జారి పడిపోయాను. రాత్రి నిద్రలేనందువల్లనేమో తెలివితప్పి పోయాను. ఎంతసేపు అలా వున్నానో, తెలివి వచ్చేసరికి చుట్టూ జనం మూగివున్నారు. అందరూ నేను చనిపోయాననే అనుకున్నారట... లేచి, తిన్నగా కాఫీహోటల్ చేరుకున్నాను. ఆ దంపతుల కథలు విన్నాను. నా కథ కూడా జోడించాను. ఇహ ఇంటికి వెళ్తున్నాను" అంటూ చక్కా వెళ్ళిపోయాడు.

ఆ కొత్త కథ కూడా నిజం అవునో కాదో తేల్చుకోలేక అక్కడే నిల్చుండిపోయాను నేను.